# అభివృద్ధి.. అద్భుతం

- మారిన 19వ వార్డు రూపురేఖలు
- రూ.49.17 కోట్లతో మౌలిక వసతుల కల్పన
- పెదజాలరిపేటకు ఐదేళ్లలో మహర్దశ

ఎంవీపీ కాలనీ: జీవీఎంసీ 19వ వార్డులో మౌలిక వసతుల కల్పనలో రాష్ట్ర ప్రభుత్వం కొత్త ఒరవడిని సృష్టించింది. దశాబ్దాలుగా అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్న ఈ వార్డును 2019లో అధికారంలోకి వచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రత్యేక దృష్టి సారించింది. పెదజాలరిపేట వ్యాప్తంగా రూ.35 కోట్లతో సీసీ రోడ్లతో పాటు భూగర్భ డ్రైనేజీ వ్యవస్థను అందుబాటులోకి తెచ్చింది. రూ.93 లక్షలతో ప్రధాన రహదారిని నిర్మించింది. దాదాపు రూ.52 లక్షలతో లాసన్స్‌బే పార్కును ఆధునికీకరించి మౌలిక వసతులు కల్పించింది. ఎంవీపీ సెక్టార్‌–11లోని జీవీఎంసీ బృందావనం పార్కు ను రూ.2 కోట్లుతో థీమ్ పార్కుగా తీర్చిదిద్దింది. సామాజిక భవనాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, శ్మశాన వాటికలు ఇలా గత కొన్నేళ్లగా పెండింగ్‌లో ఉన్న అ న్ని పనులు పూర్తిచేసి వార్డు రూపురేఖలు మార్చింది. జరిగింది.


పెదజాలరిపేటలో టిడ్కో ఆదర్శగ్రామం

## రూ.9 కోట్లతో ఆదర్శగ్రామం

పెద జాలరిపేటలో ఆదర్శగ్రామం పేరిట టిడ్కో గృహాలను నిర్మించారు. 5 బ్లాకులుగా నిర్మించిన ఈ ఆదర్శగ్రామంలో 120 మంది లబ్ధిదారులకు ఇళ్ల కేటాయింపులు చేశారు. రూ.9 కోట్ల వ్యయంతో ఈ నిర్మాణం పూర్తి చేశారు. ప్రభుత్వం ఆదేశాల మేరకు 365 ఎస్ఎఫ్‌టీతో హాల్, కిచెన్, బెడ్ రూమ్ విత్ అటాచ్డ్ బాత్‌రూమ్‌తో అత్యంత ఆధునికంగా ఈ ఇళ్ల నిర్మాణం జరిగింది. పిల్లర్స్‌తో పాటు గోడలు సైతం పూర్తిగా కాంక్రీట్‌తో నిర్మాణం చేశారు. యూజీడీ డ్రైన్, విద్యుత్, తాగునీటి సరఫరాను ముందుగానే అందుబాటులోకి తెచ్చారు. 19వ వార్డు అభివృద్ధి పనుల్లో భాగంగా రూ.93 లక్షలతో జాలరిపేటలోని ప్రధాన రహదారిని నిర్మించారు.

## రూ.2.61 కోట్లతో లుంబినీ పార్కు ఆధునికీకరణ

మూడెకరాల విస్తీర్ణంలో రూ.2.61 కోట్లతో లుంబినీ పార్కును అభివృద్ధి చేశారు. బుద్ధుడి విగ్రహం సర్కిల్, ఓపెన్ జిమ్, గ్రానైట్ వర్క్, చిల్డ్రన్ ప్లే ఏరియా, సింహాలతో కూడిన స్థూపాలు ఆకట్టుకుంటున్నాయి. ఫౌంటైన్, వాకింగ్‌ట్రాక్, రిటర్నింగ్ వాల్, క్యాంటీన్, ట్రాన్స్ గేట్, లాంగ్ స్కేపింగ్, క్రీడా ప్రాంగణాలను ఈ పార్కులో అభివృద్ధి చేశారు. రూ.16 లక్షలతో వినూత్న రకాల పూల, ఆహ్లాదకర మొక్కలతో సుందరీకరించారు.


సందర్శకుల కోసం నిర్మించిన విశ్రాంత హాల్

## రూ.52 లక్షలతో లాసన్స్ బే పార్కు


లాసన్స్ బే పార్కులో పిల్లల ఆట ప్రాంగణం

లాసన్స్ బే కాలనీ పార్కులో వ్యర్థ టైర్లతో చిన్నారుల ప్లే ఏరియాను జీవీఎంసీ అభివృద్ధి చేసింది. రూ.16.5 లక్షల ఖర్చుతో ఈ ప్రాంగణాలు రూపుదిద్దుకున్నాయి. ఇందు కోసం 1900 కేజీల పనికిరాని టైర్లను వినియోగించారు. ఇటీవల రూ.36 లక్షలతో కొత్త సౌకర్యాలను సైతం అందుబాటులోకి తెచ్చారు. స్థానిక ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా వీటిని తీర్చిదిద్దారు. వాకర్స్ యోగా చేసుకోవడానికి అనుగుణంగా ప్రత్యేక మండపాన్ని, సేదతీరడానికి ప్రత్యేక షెడ్డును నిర్మించారు.

## మోడల్ వార్డుగా తీర్చిదిద్దుతాం..



19వ వార్డును మోడల్ వార్డుగా తీర్చిదిద్దాలనే సంకల్పంతో పనిచేస్తున్నాం. ఈ వార్డులోని పెద జాలరిపేట, వాసవానిపాలెం ప్రాంతాల అభివృద్ధిపై ఇప్పటికే పూర్తిస్థాయిలో దృష్టిసారించాం. దశాబ్దాలుగా ఈ ప్రాంత ప్రజలను టీడీపీ ఓటు బ్యాంకు రాజకీయాలకు మాత్రమే వాడుకుంది. దీంతో ఈ ప్రాంతం అభివృద్ధికి ఆమడ దూరంలో ఉండిపోయింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఈ ప్రాంత అభివృద్ధికి చిత్తశుద్ధితో పని చేస్తున్నాం. ఇప్పటికే పెద జాలరిపేటతో పాటు వాసవానిపాలెం, లాసన్స్ బే కాలనీల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాం. జాలరిపేటలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు రూ.109.85 లక్షలతో ఇటీవల శంకుస్థాపన కూడా చేశాం.

– ఎంవీవీ సత్యనారాయణ, ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు ఎమ్మెల్యే అభ్యర్థి

## పెద్ద ఎత్తున అభివృద్ధి



19వ వార్డులో ప్రభుత్వం పెద్ద ఎత్తున అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టింది. యూజీడీ, టిడ్కో ఇళ్లు అందుబాటులోకి వచ్చాయి. కల్యాణ మండపాన్ని కార్పొరేట్ స్థాయిలో ఏసీ సదుపాయంతో తీర్చిదిద్దారు. 1500 మంది సామర్థ్యంతో కమ్యూనిటీ హాల్ నిర్మాణం జరుగుతోంది. గత ఐదేళ్లలో 19వ వార్డు పూర్తిస్థాయిలో అభివృద్ధి సాధించింది.

– ఒలిశెట్టి జోగారావు, 19వ వార్డు


అభివృద్ధి చేసిన లుంబినీ పార్కు

## రూ.35 కోట్లతో యూజీడీ నిర్మాణం


పెదజాలరిపేటలో అందుబాటులోకి వచ్చిన యూజీడీ

పెదజాలరిపేట వాసుల చిరకాల స్వప్నం సాకారమైంది. నగరంలోని అనేక ప్రాంతాల్లో యూజీడీ నిర్మాణం జరిగి దశాబ్దాలు గడుస్తున్నా పెదజాలరిపేట వాసులకు ఆ సేవలు 2022 వరకు సాకారం కాలేదు. గతంలో దీనికి జీవీఎంసీ ప్రణాళిక రూపొందించిన అది కార్యరూపం దాల్చలేదు. 2019లో అధికారంలోకి వచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం దీనిపై దృష్టి సారించింది. స్మార్ట్ సిటీ పనుల్లో భాగంగా రూ.35 కోట్లతో పనులు ప్రారంభించింది. తొలుత కోవిడ్ కారణంగా ఈ పనుల్లో కొంత జాప్యం జరిగినప్పటికీ జీవీఎంసీ ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టును పూర్తి చేసింది. యూజీడీతో పాటు రీసైక్లింగ్ పంప్‌హౌస్, సీసీ రోడ్డును అందుబాటులోకి తెచ్చింది.

## రూ.1.12 కోట్లతో బృందావనం పార్కు

పిల్లల నుంచి పెద్దలు, వృద్ధుల వరకు అందరికీ ఆహ్లాదాన్ని పంచేలా 19వ వార్డు ఎంవీపీ కాలనీ సెక్టార్‌–11లో థీమ్ పార్కుగా బృందావనం పార్కును ఆధునికీకరించారు. ఓపెన్ వ్యాయామశాల, షటిల్ కోర్టు, ముగ్గం ట్రాక్, ఫ్లైస్ ఆకారంలో ఆహ్లాదకరంగా ఇంటర్ లాకింగ్ టైల్స్, సందర్శకులు సేద తీరేందుకు భారీ వృక్షం చుట్టూ ఏర్పాటు చేసిన అధునాతన ట్రీబెంచ్ ఆకట్టుకుంటున్నాయి. ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు వృద్ధుల కోసం ఏర్పాటు చేసిన వెయిటింగ్ హాల్ ఆధునికీకరణ, చిన్నారుల కోసం ఏర్పాటు చేసిన ఆధునాతన చిల్డ్రన్ ప్లే ఏరియాతో పాటు డెకరేటివ్ లైటింగ్ పోల్స్, గ్రిల్‌తో కూడిన కాంపౌండ్ వాల్ వంటి సౌకర్యాలతో పార్కును సుందరంగా తీర్చిదిద్దారు.



అభివృద్ధి చేసిన బృందావనం పార్కు

## క్లుప్తంగా

### ఘనంగా దండుమారమ్మ మహోత్సవాలు


దండుమారమ్మకు పూజలు చేస్తున్న ఎంపీ ఎంవీవీ, కార్పొరేటర్ లక్ష్మి

ఆరిలోవ: జీవీఎంసీ 20వ వార్డు కాగితాల వారి వీధిలో దండు మారమ్మ అమ్మవారి మహోత్సవాలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా అమ్మవారిని నూతన వస్త్రాలు, పూలమాలలతో అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు, అభిషేకాలు చేశారు. ఈ సందర్భంగా విశాఖ ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ, కార్పొరేటర్ ముప్పల లక్ష్మి.. అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ నిర్వాహకులు ఎంవీవీతో ప్రత్యేక పూజలు చేయించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ స్థానిక నాయకులు ముప్పల సురేష్, కిరణ్‌రెడ్డి పాల్గొన్నారు.

### వైభవంగా విఘ్నేశ్వర ఆలయ వార్షికోత్సవం


విశేష అలంకరణలో స్వామి

ఆరిలోవ: జీవీఎంసీ 12వ వార్డు సాలిపేటలో అభయ గణపతి ఆలయ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. ఆలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు. సాలిపేట, పెదగదిలి, చినగదిలి, ఈశ్వరీనగర్ తదితర ప్రాంతాల నుంచి భక్తులు.. స్వామిని దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ ఆవరణలో విఘ్నేశ్వర హోమం, స్వామి కల్యాణం నిర్వహించారు.

### ఉచిత కంప్యూటర్ శిక్షణ తరగతుల ప్రారంభం


పిల్లలకు ఉచిత కంప్యూటర్ శిక్షణ అందిస్తున్న టీచర్ రమాప్రియ

డాబాగార్డెన్స్ : పాతనగరంలోని స్వామి వివేకానంద స్వచ్ఛంద సేవా సంస్థలో వేసవి శిబిరంలో భాగంగా ఆదివారం ఉచిత కంప్యూటర్ శిక్షణ శిబిరం ప్రారంభించారు. ప్రతి ఆదివారం నిర్వహించనున్న ఉచిత కంప్యూటర్ శిక్షణలో పాల్గొనదలిచే విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు తెలిపారు. కంప్యూటర్ శిక్షణ తరగతులు ఉచితంగా నిర్వహిస్తున్న టీచర్ ఎస్ఎస్ రమాప్రియను సంస్థ అధ్యక్షుడు ఈ సందర్భంగా అభినందించారు.

### పోలీస్ బైక్ ప్రారంభం


బైక్‌ను పరిశీలిస్తున్న సీఐ విజయకుమార్

సీతమ్మధార: ఎన్నికల నేపథ్యంలో నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పోలీస్ స్టేషన్లకు 30 ద్విచక్ర వాహనాలు(బైక్) పంపించారు. ఈ మేరకు ఆదివారం ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో బైక్‌ను సీఐ ఎస్.విజయకుమార్ ప్రారంభించారు. ఎలాంటి అల్లర్లు జరగకుండా చర్యలు చేపట్టేందుకు ఒక కానిస్టేబుల్ ఈ వాహనం ద్వారా పర్యవేక్షిస్తుంటారు. ట్రాఫిక్‌లో వెళ్తున్నప్పుడు కీప్ లెఫ్ట్ అని ఈ బైక్ డిజిటల్ బోర్డుపై స్క్రోలింగ్ అవుతుంది. స్టేషన్ పరిధిలో ఎటువంటి ప్రమాదాలు జరిగినా వెంటనే ప్రథమ చికిత్స జరిగేలా ఫస్ట్ ఎయిడ్ బాక్స్ ఏర్పాటు చేశారు.

# వైఎస్సార్‌సీపీ శ్రేణుల విస్తృత ప్రచారం

ఎంవీపీ కాలనీ: వైఎస్సార్‌సీపీ తూర్పు ఎమ్మెల్యే అభ్యర్థి, విశాఖ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ ఎన్నికల ప్రచారాన్ని ముమ్మరం చేశారు. జనం కోసం.. జనంలోనే పేరిట చేపట్టిన పాదయాత్ర ఆదివారం 18వ వార్డులో కొనసాగింది. ఇందులో భాగంగా ఎంపీ ఎంవీవీ 70వ రోజు 18వ వార్డులో ఎంవీపీ కాలనీ సెక్టార్‌–3లో పార్టీ శ్రేణులతో కలిసి ఇంటింట ప్రచారం నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమాన్ని, ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి అందిస్తున్న ప్రజాకర్షక పాలనను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో ఓటర్లు అఖండ మెజారిటీతో వైఎస్సార్‌సీపీని గెలిపించాలని కోరారు. ప్రజాశ్రేయస్సు కోసం ఇంతలా పనిచేసిన పార్టీ గతంలో లేదన్నారు. గత ఐదేళ్ల పాలనలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రతి ఇంటికి మంచిచేసిందన్నారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి మరోసారి ప్రజలు వైఎస్సార్‌సీపీకి పట్టం కట్టాలని, సీఎం జగన్‌ను మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని ఎంపీ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.


ఎంవీపీ సెక్టార్‌–3లో ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ

## సృజనాత్మకత హోలీ


మిల్లెట్స్‌తో రూపొందించిన చిత్రంతో చిన్నారులు, విజయ్‌కుమార్

ఏయూ క్యాంపస్: హోలీ పండగలో రంగులు మనకు అందాన్ని తెస్తాయి. మిల్లెట్స్ మనకి ఆరోగ్యాన్ని అందిస్తాయి. ఈ రెండింటిని కలిపి ఈ పండగను ఒక మంచి సామాజిక సందేశంతో నిర్వహించారు నగరానికి చెందిన చిత్రకారుడు మెకా విజయ్‌కుమార్. మిలెట్స్‌ని ఉపయోగించి హోలీ చిత్రాన్ని తీర్చిదిద్దారు. విభిన్న వర్ణాలలో సహజసిద్ధంగా లభించే ఈ చిరుధాన్యాలు.. ఎన్నో పోషకాల సమాహారమనే సందేశాన్ని ప్రజల్లోకి పంపాలనే ఉద్దేశంతో ఈ చిత్రాన్ని వారం రోజులు శ్రమించి తీర్చిదిద్దారు. అనంతరం తనవద్ద చిత్రకళను అభ్యసిస్తున్న చిన్నారులతో కలసి రంగుల హోలీ నిర్వహించారు. మంచి ఆరోగ్య అలవాట్లతో పాటు చిరుధాన్యాలను భుజిస్తూ హోలీ పండగను జరుపుకోవాలని సూచించారు.

# ‘మీ గ్రూపులతో నేను ఓడిపోయేలా ఉన్నా’

- 9వ వార్డు టీడీపీ నాయకులపై వెలగపూడి ఆగ్రహం
- ప్రచారానికి ముఖం చాటేసిన క్యాడర్

ఆరిలోవ: విశాఖ తూర్పు నియోజకవర్గంలో కొద్ది రోజులుగా టీడీపీ ప్రచారం తూతూ మంత్రంగా సాగుతోంది. ఆ పార్టీ కార్యకర్తలు వర్గపోరు, అసంతృప్తితో ఎమ్మెల్యే అభ్యర్థి వెలగపూడి రామకృష్ణబాబు చేపడుతున్న ప్రచారాలకు ముఖం చాటేస్తున్నారు. జీవీఎంసీ 9వ వార్డులో ఆదివారం నిర్వహించిన ప్రచారంలో కార్యకర్తలు లేకపోవడంతో వెలగపూడి.. నాయకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. హనుమంతవాక, సంజయ్‌గాంధీ కాలనీల్లో ఉదయం చేపట్టిన ప్రచారంలో ఎమ్మెల్యే పాల్గొన్నా కార్యకర్తలు కానరాలేదు. ఓ ఐదుగురు వార్డు నాయకులతో పాటు 12వ వార్డుకు చెందిన మరో ఆరుగురు నాయకులతో ప్రచారం చేసి మమా అనిపించాల్సిన పరిస్థితి నెలకొంది. పార్టీ 9వ వార్డు అధ్యక్షుడు అక్కరమాని రాంబాబు, ఆయన వర్గం ఈ ప్రచారానికి డుమ్మాకొట్టారు. వార్డులో ఈయనకు, పార్టీ వార్డు ఇన్‌చార్జి బుడుమూరు గోవింద్‌కు మధ్య విభేదాలు ఉన్నాయి. ఈ క్రమంలో ఆదివారం ప్రచారంలో కనీసం 15 మంది కార్యకర్తలు కూడా లేకపోవడంతో నాయకులపై వెలగపూడి మండిపడ్డారు. బీజేపీ, జనసేన నాయకులు మచ్చుకైనా కానరావడంలేదు. మీ గ్రూపులు నా ఓటమికి కారణమైనట్లు ఉన్నాయంటూ చిర్రుబుర్రులాడుతూ ఎమ్మెల్యే ఇంటిముఖం పట్టారు. రెండు వారాలు క్రితం ఇరు వర్గాలను కూర్చోబెట్టి చర్చలు జరిపినా మారలేదంటూ ఆవేదన వ్యక్తం చేసినట్టు ఆ పార్టీ నాయకులు చెప్పుకుంటున్నారు.

# ఆకట్టుకుంటున్న మత్స్య లోకం


అరుదైన చేపలను చూసి అచ్చెరువొందుతూ


రంగురంగుల పక్షుల సయ్యాటలు

ఏయూ క్యాంపస్: మత్స్యలోకం ఆహ్వానిస్తోంది.. పక్కనే పక్షి ప్రపంచం ఆత్మీయంగా పలకరిస్తోంది. బీచ్ రోడ్డులోని పోలీస్ మెస్ వెనక మైదానంలో ఏర్పాటు చేసిన మెరైన్ ఎగ్జిబిషన్ నగరవాసులకు సరికొత్త అనుభూతులను పంచుతోంది. టన్నెల్ అక్వేరియంలో అరుదైన రంగు రంగుల చేపలు ఒకేచోట చేరి ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. ప్రదర్శనలో షాక్ కొట్టే ఈల్ చేపలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. వీటితో పాటు టేకు చేప, బఫర్ ఫిష్, టైగర్ ఫిష్, అరపైమా, ఆలిగేటలర్, ఫండూస్, స్టార్ ఫిష్, బులివాగ వంటి పదుల జాతుల చేపలు కనువిందు చేస్తున్నాయి.

**పక్షి ప్రపంచం కనువిందు**

ఇక్కడ ఏర్పాటు చేసిన ప్రత్యేక పక్షి ప్రపంచం కనువిందు చేస్తోంది. ఆస్ట్రిచ్, గోల్డెన్ పీజెంట్, రింగ్ నెక్ పీజెంట్, సిల్వర్ పీజెంట్, తెల్లని బాల్‌పైథాన్, సుగర్ గ్లెడ్డైర్, అంగోర ర్యాబిట్, ఆఫ్రికన్ గ్రే పేరట్, ఇగ్వానా వంటి పదుల సంఖ్యలో పక్షులు ఇక్కడ కొలువుతీరాయి. చిన్నారులకు సంతోషాన్ని, ఆనందాన్ని, విజ్ఞానాన్ని అందించే వేదికగా ఇది నిలుస్తోంది.


పాముతో యువతి సరదా

## ఎర్నిమాంబకు ప్రత్యేక పూజలు



కంచరపాలెం : కాన్వెంట్ కూడలిలో వెలసిన ఎర్నిమాంబ అమ్మవారి ఆలయం ఫాల్గుణ మాస శుద్ధ చతుర్దశి ఆదివారాన్ని పురస్కరించుకుని భక్తులతో కిటకిటలాడింది. ఈవో డీవీఎస్ సురేష్‌బాబా నేతృత్వంలో ఆలయ పూజారమ్మ వాసుపల్లి విజయమ్మ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ ప్రధాన అర్చకులు పులఖండం శ్రీకాంత్ శర్మ ఉదయం నుంచి అమ్మవారికి కుంకుమ పూజలు, విశేషార్చనలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు ప్రత్యేక ఉచిత దర్శనాలతో పాటు రూ. 10, రూ. 50 దర్శనాలు కల్పించారు. దూరప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఆలయ పరిసరాల్లో వంటా వార్పు చేసుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ చైర్మన్ లండ రమణ, సిబ్బంది, కమిటీ సభ్యులు భక్తుల సౌకర్యాలు పర్యవేక్షించారు.

# ఘనంగా మట్టల ఆదివారం


పెదగదిలిలో మట్టల ఆదివారం నిర్వహిస్తున్న ఇమ్మానియేల్ చర్చి భక్తులు



మట్టలను ప్రదర్శిస్తూ వీధుల్లో ర్యాలీ నిర్వహిస్తున్న లూథరన్ చర్చి సభ్యులు

ఆరిలోవ: ఆరిలోవ ప్రాంతంలో పలు చర్చిల ఆధ్వర్యంలో క్రిస్టియన్‌లు మట్టల ఆదివారాన్ని ఘనంగా నిర్వహించారు. ఈత మట్టలను రంగుల పేపర్లతో అలంకరించి ర్యాలీలు చేశారు. పెదగదిలిలో ఇమ్మానియేల్ చర్చి ఆధ్వర్యంలో క్రిస్టియన్‌లు చేపట్టిన ర్యాలీ చినగదిలి వరకు సాగింది. ఆరిలోవ ఆఖరి బస్ స్టాప్, దుర్గాబజార్, టీఐసీ పాయింట్, బాలాజీనగర్, హనుమంతవాక, ఇందిరానగర్, విశాలాక్షినగర్ తదితర ప్రాంతాల్లోని చర్చిల్లో మట్టల ఆదివారం పండగ నిర్వహించారు. ఏసుక్రీస్తు కీర్తనలతో ర్యాలీలు చేపట్టారు.

**లూథరన్ చర్చిలో..**

ఎంవీపీ కాలనీ: ఇమ్మానియేల్ లూథరన్ చర్చిలో మట్టల ఆదివారాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ వేడుకలో భాగంగా చర్చిలో యూత్ సభ్యులు ఆదివారం ఎంవీపీ కాలనీ వీధుల్లో మట్టలు ప్రదర్శిస్తూ ర్యాలీ చేపట్టారు. క్రీస్తు గీతాలు ఆలపించారు. అనంతరం చర్చి సభ్యులను ఉద్దేశించి సెక్టార్‌–2లోని చర్చి ప్రాంగణంలో బ్రదర్ పాలపర్తి బెల్టాజర్ (భీమవరం) మాట్లాడుతూ క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో జరుపుకొనే పండగలలో మట్టల ఆదివారం ఒకటన్నారు. శిలువ మరణానికి ముందు ఏరుషలేముకు వచ్చిన ఏసుకు 20 లక్షల మంది కర్జూరపు మట్టలతో స్వాగతం పలికారని గుర్తు చేశారు. ఆ ఆహ్వానాన్ని విజయ సూచికగా పరిగణించి ఏటా మట్టల ఆదివారం పండగ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా చర్చిలో పలు ప్రత్యేక కార్యక్రమాలు బోధనలు, ప్రార్థనలు జరిగాయి. పలువురు చర్చి సభ్యులు క్రీస్తును అంగీకరిస్తూ తీర్మానాలు చేశారు.

# ప్రజాస్వామ్యానికి వ్యవస్థలే ముఖ్యం

సీతంపేట: ప్రజాస్వామ్యం విజయవంతం కావడానికి వ్యవస్థలు సక్రమంగా పనిచేయాలని సెంటర్ ఫర్ పాలసీ స్టడీస్ డైరెక్టర్ ఆచార్య ఎ.ప్రసన్నకుమార్ అన్నారు. సెంటర్ ఫర్ పాలసీ స్టడీస్, విశాఖ పబ్లిక్ లైబ్రరీ సంయుక్తంగా ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ఆదివారం కేంద్ర విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి ఎస్.జయశంకర్ రచించిన గ్రంథం ‘వై భారత్ మేటర్స్’పై జరిగిన చర్చా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వ్యక్తులు మారినా సంస్థలు శాశ్వతంగా నిలిచి ఉంటాయన్నారు. న్యాయవాది ఎం.రామదాస్ మాట్లాడుతూ జయశంకర్ రచించిన పుస్తకంలోని ముఖ్య అంశాలను సమీక్షించారు. భారతదేశం ప్రపంచంలో శక్తివంతమైన దేశంగా ఎదగడానికి తగిన వనరులున్నాయని, వ్యవస్థల మధ్య సమన్వయంతో పాలన సాగాలన్నారు. లంకపల్లి బుల్లయ్య కళాశాల కరస్పాండెంట్ జి.మధుకుమార్ మాట్లాడుతూ నెహ్రూ, ఇందిరా గాంధీ, పీవీ నరసింహారావు, నరేంద్రమోదీ విధానాలను వివరించారు. కార్యక్రమంలో గ్రంథాలయ కార్యదర్శి డి.ఎస్.వర్మ, రచయిత డి.వి.సూర్యారావు, వివిధ రంగాల ప్రముఖులు, మేధావులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఆచార్య ప్రసన్నకుమార్

## విశాఖ మ్యూజిక్ అకాడమీ అవార్డుల ప్రదానం

మద్దిలపాలెం : విశాఖ మ్యూజిక్ అకాడమీ 2024 సంవత్సరానికి సంబంధించి ఇద్దరు గాత్ర సంగీత విద్వాంసులను పురస్కారాలతో సత్కరించారు. ఆదివారం మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో జరిగిన ఈ కార్యక్రమంలో చెన్నైకు చెందిన ప్రముఖ గాత్ర సంగీత విద్వాంసురాలు బి.లలితమాధవ్‌కు ఓరిరాల జ్ఞానానంద పురస్కారం ప్రదానం చేశారు. విశాఖ నగరానికి చెందిన గాత్ర సంగీత విద్వాంసురాలు సుధారాణికి సంగీత అకాడమీ పురస్కారం అందజేశారు. అనంతరం పురస్కార గ్రహీతల గాత్ర కచేరి శ్రావ్యంగా సాగింది. ఈ కార్యక్రమంలో అకాడమీ ఉపాధ్యక్షులు భుజంగరావు, డాక్టర్ పేరాల బాల మురళీకృష్ణ, శ్రీనివాస్, విజయకుమార్, తదితరులు పాల్గొన్నారు.


సుధారాణికి సంగీత నాటక అకాడమీ పురస్కారంతో సత్కరిస్తున్న అకాడమీ సభ్యులు